జగనన్న విద్యాదీవెన లబ్ది రూ.29.50 కోట్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జగనన్న విద్యాదీవెన పథకం కింద జిల్లాలో 39,368 మంది విద్యార్థులకు రూ.29.50 కోట్ల లబ్ది చేకూరింది. శుక్రవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృష్ణాజిల్లా నుంచి విద్యార్థులకు బటన్ నొక్కి నగదును వారి ఖాతాలో నేరుగా జమచేసి ప్రారంభించారు. తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యాదీవెన మొత్తం తల్లుల, విద్యార్థుల ఉమ్మడి ఖాతాలో జమ అయిన పది రోజుల్లోపు సంబంధిత కళాశాలలకు చెల్లించి తల్లులు సహకరించాలని, లేనిచో తదుపరి వారి జగనన్న విద్యాదీవెన మొత్తాన్ని నేరుగా కళాశాలలకు చెల్లిస్తామన్నారు. మెగాచెక్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని నిలువునా ముంచారు..!

న్యాయ సాధన సభలో కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఆప్

బిజెపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని లేదు

ఫ్యాన్లు, సైకిళ్లు బయట పడేయండి

రూ.12 లక్షల కోట్లు నష్టపోయాం

సభలో ప్రసంగిస్తున్న వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ప్రత్యేక హోదా ఇస్తామని నమ్మబలికి ఆంధ్ర రాష్ట్ర ప్రజలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిలువునా ముంచేసిందని, గడిచిన 10 ఏళ్లలో విభజింపబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 12 లక్షల కోట్ల విలువ గల ప్రయోజనాలను కోల్పోయిందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి అన్నారు. బిజెపికి తొత్తులుగా వ్యవహరిస్తున్న వైసిపి, టిడిపి ఫ్యాన్లు, సైకిళ్లను ఊరి బయట పడేయాలని సభ పిలుపునిచ్చింది. బిజెపితో వైసిపి టిడిపి ట్రైయాంగిల్ లవ్ స్టోరీ నడుపుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక హోదా పదేళ్ల పాటు ఇస్తామని డిక్లరేషన్ ప్రకటించింది. శుక్రవారం తిరుపతి తారకరామా స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా డిక్లరేషన్ న్యాయ సాధన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని, కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇవ్వడానికి కట్టుబడి ఉందన్నారు. 2014లో ఇదే మైదానంలో ఏర్పాటు చేసిన వేదికపై ఆనాటి ప్రధానమంత్రి అభ్యర్థిగా ఉన్న నరేంద్ర మోడీ నేడు ప్రధానమంత్రిగా కొనసాగుతున్నా ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడానికి బిజెపికి ఇష్టం లేదని తేటతెల్లమైపోయిందన్నారు. ప్రత్యేక హోదా ఇచ్చే కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రాహుల్ గాంధీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడానికి కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి సంతకం చేస్తానని ప్రకటించారన్నారు. తల్లి లాంటి ఆంధ్రప్రదేశ్ కి ప్రత్యేక హోదా ఇవ్వకుండా పదేళ్లుగా చంపుతున్నారని, మూకుమ్మడి రాజీనామాలు చేస్తే ప్రత్యేక హోదా ఎందుకు రాదు అన్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి ప్రత్యేక హోదా కోసం ఏమి పోరాటాలు చేశారో చెప్పాలన్నారు. తెలుగుదేశం పార్టీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు రెండు బిజెపితో అంతర్గత పొత్తు కలిగినవేనని తేల్చి చెప్పారు. బిజెపి ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకూ ఈ రెండు పార్టీలు పరోక్షంగా సహకారం అందించాయన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఇందిరమ్మ అభయ హస్తం ద్వారా ప్రతి పేద కుటుంబానికి 5 వేల రూపాయలు ఇచ్చే గ్యారెంటీ స్కీమును ఇప్పటికే ప్రకటించామన్నారు.

నారాయణ, సిపిఐ

ఏఐసిసి కార్యదర్శి సచిన్ పైలట్ మాట్లాడుతూ విభజింపబడ్డ ఆంధ్రప్రదేశ్ కు మంచి ప్రయోజనాలు చేకూరాలనే లక్ష్యంతో బుందేల్‌ఖండ్ తరహాలో సాయం, వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక నిధుల కేటాయింపు వంటి అంశాలతో విభజన చట్టాన్ని రూపొందించి, ఆర్థిక కమిషన్ కు పంపించామన్నారు. విభజన చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం పదేళ్లు గడిచినా కుంటి సాకులు చెబుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. గడిచిన 10 ఏళ్లలో ఇప్పటివరకు కార్పొరేట్లకు అండగా నిలుస్తూ వారికి రాయితీలు ఇస్తున్నారే గాని దేశంలోని రైతులకు, నిరుద్యోగులకు, గిరిజనులకు ఎటువంటి ప్రయోజకర పాలసీలను బిజెపి సర్కార్ తీసుకురాలేదన్నారు. మాజీ శాసనసభ్యులు, సిపిఎం నేత ఎంఎ గఫూర్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా కోసం ఇండియా కూటమిలో చేరామని, ప్రత్యేక హోదా కోసం ఏ పోరాటానికైనా కలిసి వస్తామన్నారు. ప్రధాని మోడీ తిరుపతి దేవుని సన్నిధిలో ఇచ్చిన మాటను తప్పి ఆ మూడు నామాలవాడికే పంగనామాలు పెట్టిన మోసగాడన్నారు. బిజెపి మతాన్ని ఆయుధంగా చేసుకుని విద్వేషాలను రెచ్చగొడుతూ దేశ విచ్ఛిన్నానికి పాటుపడుతోందన్నారు. సిపిఐ జాతీయ నాయకులు నారాయణ మాట్లాడుతూ ఫ్యాను, సైకిల్ ను ఊరి బయట పడేయాలని అన్నారు. కేంద్ర హోం మంత్రిగా ఉన్న అమిత్ షా ఒక హత్య కేసు నుండి బయట పడడానికి 12 మందిని చంపాడని ఆరోపించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి బొమ్మతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి నేడు ఆయన ఫోటోనే కనుమరుగు చేశాడన్నారు. అధికారం కోసం వాడుకుని వదిలేయడం వైసిపి, టిడిపి పార్టీలకు పరిపాటిగా మారిపోయిందన్నారు. మాజీ ఎంపీ చింతామోహన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హోదా ఇవ్వడానికి సిద్ధంగా ఉందని, ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తిరుపతి రాజధానిగా అవ్వాలని ఆకాంక్షించారు. ప్రత్యేక హోదా డిక్లరేషన్ న్యాయ సాధన సభకు వేల సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ సభలో కాంగ్రెస్ నాయకులు కనుమూరి బాపిరాజు, గిడుగు రుద్రరాజు, రఘువీరా రెడ్డి, జెడి శీలం, పల్లం రాజు, రాకేష్, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ అధ్యక్షురాలు తాంతియా కుమారి, సునీల, ఆప్ రాష్ట్ర నాయకులు మణి నాయుడు, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, కె.మోహన్ పాల్గొన్నారు.


ఎంఎ గఫూర్, సిపిఎం

సభా ప్రాంగణంలో కరకంబాడి ఇళ్లస్థలాల బ్యానర్

ధర ఉన్నా.. ధాన్యం లేక..

- సాగు నీరు లేక ఆవేదన
- షుగర్‌లెస్ 77 కిలోల బస్తా రూ.2050
- కల్లాల్లోనే అమ్మేస్తున్న రైతులు

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ

వర్షాలతో పంట మొత్తం కొట్టుకుపోయి, తిరిగి పెట్టుబడులు పెట్టి వరి పంట సాగు చేసిన రైతులకు 'కష్టం' కలిసొచ్చింది. ఈసారి ధాన్యం ధర కొంత మెరుగ్గానే ఉందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. షుగర్‌లెస్ 77 కిలోల బస్తా ధర రూ.2050 పలుకుతోంది. గత ఏడాది ఇదే రకం 1650 రూపాయలు పలికింది. దీంతో కల్లాల్లోనే ధాన్యాన్ని అమ్మేసి అప్పులకు జమచేసి, కొన్ని బస్తాలను ఇంట్లో అన్నానికి భద్రపరచుకుంటున్నారు.

ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా వచ్చినా తుపాను ప్రభావంతో వాగులు, గుంటలు, చెరువులు జలకళ సంతరించుకున్నాయి. దీంతో కష్టపడి వ్యవసాయం సాగించారు. గతంలో వ్యాపారులు ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువగానే ధాన్యం కొనుగోలు చేసేవారు. అయితే ఈ ఏడాది ఆరంభంలో సన్నాలకు బహిరంగ మార్కెట్లో డిమాండ్ ఉండడంతో రైతులు పొలాల్లేనే అమ్మేస్తున్నారు. ధాన్యం కొనుగోలు ధర షుగర్ లెస్ 77 కిలోలు బస్తా ధర రూ.2050కి, కేఎన్ఎం 1638 రకం 1900 నుండి 2000 రూపాయలు, 1271 వ రకం 1700 నుండి 1800 రూపాయలు, అన్నపూర్ణ రకం 1800 నుండి 1000 రూపాయలు, పుడుగులు 1600 నుండి 1700 వరకు, పెద్ద జీలకర్ర బీపీటీ 1900 నుండి 2000 రూపాయల ధర పలుకుతోంది. తరుగు కింద రెండు కేజీలు తీసి, రవాణా, ఇతర ఛార్జీలు కలసి వస్తాయని కల్లాల్లోనే నూర్పిడి చేసేసి అమ్మేస్తున్నారు. ఈ మండలంలో కొనుగోలు చేస్తున్న వ్యాపారులు తమిళనాడు రాష్ట్రానికి, ఆంధ్ర చుట్టుపక్కల ప్రాంతాలకు మండపేటకు ఎక్కువ సంఖ్యలో ధాన్యం బస్తాలు తరలి వెళుతున్నాయి. అయితే చివరి దశలో వరి నాట్లు వేసుకున్న రైతులు మాత్రం నీటి వనరులు లేక నానా అవస్థలు పడుతున్నారు. గతంలో తెలుగుగంగ వదిలేవారు. అయినా గిట్టుబాటు ధర ఉండేది కాదు. ప్రస్తుతం ధర ఉన్నా నీరు లేక కొన్ని ప్రాంతాల్లో పంట ఎండిపోతోంది.

రకం	77 కిలోల బస్తా
షుగర్‌లెస్	రూ.2050
కెఎన్ఎం 1638	రూ.2000
1271వ రకం	రూ.1700
అన్నపూర్ణ	రూ.1800
పుడుగులు	రూ.1700
పెద్ద జీలకర్ర	రూ.2000

పొట్ట దశలో నీరు లేకుండా పోయింది : సిహెచ్ కృష్ణయ్య, కనమనంబేడు

15 ఎకరాల్లో వరి నాట్లు వేశాం. మిచౌంగ్ తుపాను వల్ల ఊరు మొత్తం కొట్టుకుపోయింది. నష్టపోయాను. మళ్లీ వరి నాట్లు నాటాము. ఇపుడు వరి పొట్ట దశకు చేరుకుంది. నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. తెలుగుగంగ అధికారులు దయతలచి తెలుగుగంగ నీరిస్తే పంట బాగా పండుతుంది. ఈసారి ధర బాగుంది. మా బతుకులు బాగుపడతాయి.

గంగ కోసం రైతుల పోరాటం

- అడ్డుకున్న పోలీసులు
- ఎంపీ చెప్పినా వినని ఖాకీలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వేసవి సమీపిస్తున్న వేళ తెలుగుగంగ నీటి కోసం రైతన్నలు పోరుబాట పట్టారు. తాగునీటికే కాదు సాగు నీటికీ అవకాశం కల్పించాలంటూ తొట్టంబేడు మండలం లక్ష్మీపురం తెలుగు గంగ ఎస్కేప్ గేట్ల వద్ద శుక్రవారం నీటి మళ్ళింపుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న గంగ అధికారులు హుటాహుటిన పోలీసులను పంపి రైతులను అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమయంలో అటుగా వెళ్తున్న తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి విషయం తెలుసుకుని అక్కడకు వెళ్లారు. రైతులు తమ ఆవేదనను చెప్పుకోవడంతో స్పందించిన ఎంపీ గంగ నీటి మళ్ళింపుకు రైతులకు అవకాశం ఇవ్వాలని పోలీసులను ఆదేశించి వెళ్లారు. అయితే ఎంపీ అటు వెళ్లగానే పోలీసులు మళ్ళీ గంగ నీటిని మళ్ళిస్తున్న రైతులను అడ్డుకున్నారు. రైతులు ఎంత చెప్పినా వినకుండా దౌర్జన్యానికి దిగారు. తెలుగు గంగ ఎస్ఈ చెబితే తప్ప నీటిని మళ్ళించే ప్రసక్తి లేదని తెగేసి చెప్పడంతో చేసేది లేక రైతులు తిరుగుముఖం పట్టారు. తెలుగుగంగ నీటి ద్వారా తొట్టంబేడు, కేబీబీపురం మండలాల సరిహద్దుల్లోని కాలువ పరీవాహక ప్రాంతాల రైతులు పెద్ద ఎత్తున పంటలు పండిస్తున్నారు. కొందరు నేరుగా నీటిని వాడుకుంటుండగా, మరి కొందరు చెరువులకు మళ్ళించి తద్వారా ఆయకట్టు పారించుకుంటున్నారు. అయితే కాలువలో నీటి ప్రవాహం తక్కువగా ఉండడంతో సాగునీటి వినియోగానికి గంగ అధికారులు మోకాలడ్డుతున్న పరిస్థితి. దీంతో రైతులు రబీలో వేసిన తమ పంటలను కాపాడుకోవడం కోసం ఇలా సాగునీటి పోరాటానికి దిగగా ఖాకీలు భగ్నం చేసి రైతులకు మొండిచెయ్యి చూపడం విచారకరం.

భూవివాదాల పరిష్కార దిశగా ల్యాండ్ టైట్లింగ్ చట్టం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రైతుల భూవివాదాల పరిష్కార దిశగా ఎపి ల్యాండ్ టైట్లింగ్ చట్టం -2023ను తీసుకొచ్చామని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్దార్థజైన్ అన్నారు. శుక్రవారం శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలోని సావేరి అతిథిగృహంలో చట్టంపై ముఖ్యమంత్రి సలహాదారు అజయ్‌కలామ్, కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ కలిసి రైతులు, రెవెన్యూ అధికారులు, అడ్వకేట్లు, పోలీసు శాఖకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిద్దార్థజైన్ మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేస్తూ భూ యాజమాన్య వివాదాలు పరిష్కరించి భూ హక్కులపై రైతులకు పూర్తి భరోసా కల్పించనున్నట్లు చెప్పారు. భూములకు సంబంధించిన సమస్యలు, మోసాలు విపరీతంగా పెరిగిపోతున్న తరుణంలో వివాదాలకు అవకాశం లేకుండా చేయడమే లక్ష్యంగా రైతులకు అవగాహన కల్పించే దిశగా శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో మొదలు పెట్టామన్నారు. బ్రిటీష్ కాలం నాటి రికార్డులను ఆధునీకరించడంలో అనేక సమస్యలు ఏర్పడ్డాయన్నారు. ఈ చట్టం వివిధ వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వము రీ సర్వేలో భాగంగా ఎయిర్ క్రాఫ్ట్, రోవర్ వంటి ఆధునిక టెక్నాలజీ ద్వారా ప్రతి భూ సరిహద్దును జియో రిఫరెన్స్ చేసి రైతులకు భూ హక్కు పత్రంలను జారీ చేసే విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. మొత్తం టైటిల్ రికార్డులు సురక్షితమైన ఆన్లైన్ సిస్టంలో నిల్వ చేయబడి మొబైల్ ఫోన్లు లో రైతుల భూ సరిహద్దును చూసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. అజయ్‌కలామ్ మాట్లాడుతూ పాత భూరికార్డులకు స్వస్తి పలికి రైతులకు శాశ్వత హక్కులు కల్పించే దిశగా ఈ చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ పెంచల్ కిషోర్, తిరుపతి ఆర్ డి ఓ నిశాంత్ రెడ్డి, ఎడి సర్వేయర్ అధికారి జయరాజ్ పాల్గొన్నారు.

అవగాహనా కార్యక్రమంలో సిద్దార్థ జైన్

ఉద్యోగులు క్రీడాస్ఫూర్తితో పనిచేయాలి : టిటిడి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఉద్యోగులు క్రీడాస్ఫూర్తితో పనిచేసి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి కోరారు. ఉద్యోగుల వార్షిక క్రీడాపోటీలు శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో గల పరేడ్ మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈవో ఏవి.ధర్మారెడ్డి ఉద్యోగులతో క్రీడాప్రతిజ్ఞ చేయించారు. ముందుగా ఛైర్మన్, ఈవో కలిసి క్రీడాపతాకాన్ని ఆవిష్కరించారు. బెలూన్లు, శాంతి కపోతాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఛైర్మన్ మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగులకు మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు, క్రీడల పట్ల ఆసక్తిని పెంచేందుకు ప్రతి సంవత్సరం క్రీడాపోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు పునరుత్తేజం కలుగుతుందని చెప్పారు. ఉద్యోగులకు క్రీడల పట్ల ఉన్న శ్రద్ధను గమనించి ఇండోర్ స్టేడియం నిర్మాణానికి తమ బోర్డు రూ.10 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఉద్యోగులు మంచి ప్రతిభ కనబరిచి క్రీడల్లో పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని కోరారు. టిటిడి సంక్షేమ విభాగం డెప్యూటీ ఈఓ స్నేహలత మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం, వారి మానసిక వికాసం కోసం 1977వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గతేడాది 829 మంది పురుషులు, 422 మంది మహిళలు పాల్గొన్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో మొదటి స్థానం గెలుచుకున్న వారికి రూ.2వేలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ.1800, మూడో స్థానంలో నిలిచినవారికి రూ.1600 విలువగల బ్యాంకు గిఫ్ట్‌కార్డులు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్, ఈవో వాలీబాల్ ఆడి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహకిషోర్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ముఖ్య గణాంకాధికారి శేషశైలేంద్ర, సీపీఆర్వో డా.టి.రవి, విజిఒ బాలిరెడ్డి పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్ ఉచిత వైద్యశిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

డాక్టర్ బికె బసు 112 వ జయంతి సందర్భంగా తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ ఎంఎస్ బాలాజీ పర్యవేక్షణలో ఆక్యుపంక్చర్ ఉచిత వైద్య శిబిరాన్ని రిటైర్డ్ జిల్లా జడ్జి పి గుర్రప్ప శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిప్రజలకు ఉచితంగా ఆక్యుపంక్చర్ వైద్యం పది రోజులు పాటు నిర్వహించటం హర్షనీయమని, తిరుపతి నగర ప్రజలు వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ, సామాజిక కార్యకర్త పి. అంజయ్య, డాక్టర్ మునస్వామి, డాక్టర్ జాలేశ్వర రావు, ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షులు తమటం రామచంద్రారెడ్డి ప్రసంగించారు. వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున అధ్యక్షత వహించారు.

స్విమ్స్ కాంట్రాక్టు కార్మికుల చర్చలు సఫలం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వేతనాలు పెంచాలని, హోదాలను మార్పు చేయాలని స్విమ్స్ ఆసుపత్రిలోని కాంట్రాక్ట్ కార్మికులు శుక్రవారం ఉదయం నుంచి స్విమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీర్ఘకాలికంగా తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో స్విమ్స్ యాజమాన్యం సానుకూలంగా వ్యవహరించడం లేదని ఆరోపిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో నిరాహార దీక్షను స్విమ్స్ కాంట్రాక్ట్ కార్మికులు డైరెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టారు. ఈ దీక్షలను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ వేతనాల పెంపు, హోదాల మార్పు విషయంలో స్విమ్స్ యాజమాన్యం, టిటిడి తీవ్రంగా వైఫల్యం చెందాయని ఆరోపించారు. స్వయంగా డైరెక్టర్ సమక్షంలో జరిగిన నిర్ణయాలు అమలు కాకపోతే ఎలా? అని ఆయన నిలదీశారు. రిపబ్లికన్ పార్టీ నేత పూతలపట్టు అంజయ్య కార్మికులకు మద్దతు ప్రకటించారు సిఐటియు తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి కే. వేణుగోపాల్, జిల్లా నేతలు ఆర్ లక్ష్మి, బుజ్జి, వాసు స్విమ్స్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నేతలు రవి, సూరి, మారి ముత్తు తదితరులు ప్రసంగించారు. నిరాహార దీక్షలు చేపడుతున్న కార్మిక నాయకులను, సిఐటియు నేతలను స్విమ్స్ ఆసుపత్రి యాజమాన్యం చర్చలకు ఆహ్వానించింది. కందారపు మురళి యూనియన్ నేతలు రవి, సూరి, మారి ముత్తు, సుబ్రహ్మణ్యం లతో డైరెక్టర్ ఆర్.వి. రవికుమార్, ఎంఎస్ డాక్టర్ రామ్, జిఎం జి. బాబు తదితరులు చర్చలు జరిపారు. తమ పరిధిలోని అన్ని రకాల సమస్యలను తక్షణం పరిష్కరిస్తున్నామని ప్రకటించారు. దీంతో దీక్షలను కార్మికులు విరమించారు.

ఇంటర్ పరీక్ష ప్రారంభం

తొలిరోజు 793 మంది గైర్హాజర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జూనియర్ ఇంటర్మీడియట్ సంస్కృతం 1 పేపర్ పరీక్షకు తిరుపతి జిల్లాలో 793 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐఒ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా 32,989 మంది దరఖాస్తు చేసుకోగా, 32,196 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఇందులో జనరల్ కోర్సులో 31,647 మందికి గాను 30,967 మంది హాజరు కాగా, 680 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లో 1342 గాను 1229 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 113 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐఓ పేర్కొన్నారు.

రేపు పల్స్‌పోలియో

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

మార్చ్ 3వ తేది ఆదివారం జాతీయ పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా పల్స్ పోలియో కార్యక్రమం చేపడుతున్నట్లు తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ఐఎఎస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 3వ తేది 23 రూట్లలలో 207 పల్స్ పోలియో బూతులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. 5 సంవత్సరాల లోపు పిల్లలకు ఏర్పాటు చేస్తున్న సెంటర్లలో పల్స్ పోలియో వేస్తామని,4,5 తేదిల్లో ఇంటింటికి వెళ్లి పరిశీలించి ఇంకా ఎవరైనా 5 సంవత్సరాలలోపు పిల్లలు పోలియో చుక్కలు వేసుకోకుండా వుంటె వారికి వేస్తామన్నారు. పోలియో వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్క తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకొని తమ ఇంట్లో వున్న ఐదు సంవత్సరాల లోపు చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

'పేట'లో రాజకీయ 'వలసలు

ప్రజాశక్తి - నాయుడుపేట

టిడిపి తీర్థం పుచ్చుకున్న వెయ్యి కుటుంబాలు

సూళ్లూరుపేట నియోజకవర్గంలో టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి నెలవల విజయశ్రీ చక్రం తిప్పుతున్నారు. ఎన్నికల్లో మొదటిసారిగా ఆమె రాజకీయ అరంగేట్రం చేసినప్పటికీ ఆమె తండ్రి సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నెలవల సుబ్రమణ్యంకు ప్రతి ఒక్కరితో ఉన్న సన్నిహిత సంబంధాలు ఆమెకు కలిసొస్తున్నాయని రాజకీయ విశ్లేషకుల అంచనా. సిట్టింగ్ ఎంఎల్ఎపై ఉన్న వ్యతిరేకతతో కొంతమంది టిడిపిలోకి రాజకీయ వలసలు ప్రారంభించారు. ఈ అంశాలన్నీ ఆమెకు అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని చర్చ నడుస్తోంది. అధికార పార్టీలో గ్రూపు రాజకీయాలు, కొందరు నాయకులు నింతల్లా వ్యవహరించడం వల్ల అధికార పార్టీలోని కొందరు నెలవల విజయశ్రీ వైపు మొగ్గు చూపుతున్నారని సమాచారం. నెలవల విజయశ్రీ పేరును ఖరారు చేసినప్పటి నుంచి సుడిగాలిలా నియోజకవర్గమంతా పర్యటనలు చేస్తూ నాయకులను, కార్యకర్తలను కూడగట్టుకుంటున్నారు. తండ్రి పంథాలోనే ఆమె నడవడం, రాజకీయ మెళకువలను నేర్చుకుంటూ తండ్రికి తగ్గ తనయగా అందరినీ కలుపుకుపోతున్నారని చర్చ నడుస్తోంది. ఆమె పేరును ఖరారు చేసినప్పటి నుంచి ఇప్పటివరకూ అన్ని గ్రామాల్లో ఏకబిగిన దాదాపు వెయ్యి కుటుంబాలు టిడిపి కండువా కప్పుకున్నాయి. అందులోనూ నాయుడుపేట పట్టణంలో అధిక సంఖ్యలో ఉండటం నెలవల మార్క్ రాజకీయం కనిపిస్తోంది.

రోడ్డెక్కిన వైసిపి 'గ్రూప్' రాజకీయం

ప్రజాశక్తి - నాయుడుపేట

సూళ్లూరుపేట వైసిపి నేత కళత్తూరు శేఖర్‌రెడ్డి గురువారం అర్ధరాత్రి తన అనుచరులతో దళితులపై దాడిచేసి, కులం పేరుతో దూషించారని పెళ్లకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేసి, వారిని వెంటనే అరెస్టు చేయాలని వైసిపి నాయకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నాయుడుపేట ప్రధాన రహదారైన పోలీసు స్టేషన్ ఎదుట శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. దీంతో గంటసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. డిఎస్‌పిలు, సిఐలు భారీగా చేరుకుని సత్యనారాయణరెడ్డికి సర్దిచెప్పినా నిందితులను అరెస్టు చేసే వరకూ ఆందోళన విరమించేది లేదని ఖరాఖండిగా చెప్పడంతో పోలీసులు ఏమీ చేయలేకపోయారు. గ్రూపు రాజకీయం రోడ్డెక్కడంతో కార్యకర్తలు, అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే టిడిపిలోకి భారీగా వసలు వెళుతున్న తరుణంలో అధికార పార్టీకి ఈ గొడవలు మరింత దెబ్బతినే అవకాశం లేకపోలేదు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలో ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం పరీక్షలు ఐదు కేంద్రాలలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థినివిద్యార్థులను తల్లిదండ్రులు పరీక్ష కేంద్రానికి తీసుకువచ్చారు. సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు . ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని వసతులు ఏర్పాటు చేశారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న పల్స్ పోలియోను విజయవంతం చేయాలని డాక్టర్ దివాకర్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 30 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆ కేంద్రంలో ఎంపిహెచ్‌ఎలు, ఆశ వర్కర్లు అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరు కావాలన్నారు. మండలంలో వున్న 368 మంది ఐదు సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు వయసున్నట్లు తెలిపారు. 4,5వ తేదీల్లో మండలంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి మిగిలిన పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివాకర్ హెల్త్ సూపర్వైజర్లు వెంకటేశ్వర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గణేష్ వ్యాఖ్యలు సరికాదు: హేమంత్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరపాలక సంస్థ మాజీ డివిజన్ కార్పొరేటర్ తమ్ముడు గణేష్ కృష్ణ యాదవ్‌పై చేసిన వ్యాఖ్యలు సభ్యతగా లేదని, నందమూరి అభిమానులుగా ఏనాడు అభిమానులకు కేటాయించే టికెట్లను అక్రమంగా అమ్ముకోలేదని నందమూరి అభిమాన అసోసియేషన్ నాయకులు హేమంత్, నాని అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి అబద్ధపు ఆరోపణలు చేయడం మంచిది కాదని కార్పొరేటర్ గణేష్ కు హెచ్చరించారు. కృష్ణ యాదవ్ సేవా తత్పరుడని, అలాంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, కుల దూషణకు పాల్పడ్డారని అబద్ధాలు వల్లించడం తగదన్నారు. ఈ సమావేశంలో కేదిలి, బాలు, మురళి, బాల పాల్గొన్నారు.

విద్యార్థులకు 'స్కౌట్స్ అండ్ గైడ్స్'లో శిక్షణ ఉండాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యార్థి దశ నుండే స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణ కలిగి ఉండాలని, పుత్తూరు బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి పేర్కొన్నారు. పుత్తూరు బాలికల హైస్కూలులో గేల్స్ హై స్కూలులో ప్రధానోపాధ్యాయులు ఏ భువనేశ్వరి నూతనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ గైడ్స్ 3 యూనిట్లను ఏర్పాటు చేశారు. ఆర్. నాగలక్ష్మమ్మ, ఎం. సునీత,బి .రెడ్డి రాణి మున్గురు ఉపాధ్యాయులను నియమించారు. యూనిట్‌కు 32 మంది చొప్పున 96 మంది విద్యార్థులను కేటాయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ ఏ వెంకటేశ్వర్లు విద్యార్థులకు గైడ్స్ శిక్షణ తరగతుల గురించి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ గైడ్స్ లీడర్స్ చారులత, దీపిక గీతిక సీనియర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సతీమణి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: పాకాల మండలంలోని ఇ.పాలగుట్టపల్లె పంచాయతీలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి కలిసి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ విక్రమ్ రెడ్డి, జెడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచార నిర్వహించారు. గడప గడపకు వెళ్లి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, బీసీ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ ముఖ్మిని రఘుపతి, వైసీపీ మొగరాల డివిజన్ అధ్యక్షుడు మొగరాల హరిప్రసాద్ రెడ్డి, మండల కన్వీనర్ నరేష్ రెడ్డి, సర్పంచ్ సిద్ధారెడ్డి, ప్రత్యూష్ రెడ్డి, జయ ప్రసాద్, శివారెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 20, బుచ్చినాయుడుపల్లె స్పెషల్ క్యాంప్ లో భాగంగా రెండవ రోజు స్వచ్ఛభారత్ ప్లాస్టిక్ అవగాహన ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన– నివారణను నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె రుక్మిణి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్స్ ఉత్సాహంగా పాల్గొని బుచ్చినాయుడుపల్లె గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి తొలగించారు. ప్రొఫెసర్ సువర్ణలతాదేవి, ప్రొఫెసర్ చంద్ర కుమారి, డాక్టర్ వాణి, డాక్టర్ జ్ఞానేశ్వరి ప్లాస్టిక్ వలెనాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎలా నిర్మూలించాలి? ప్లాస్టిక్ వాడకాన్ని ఎలా తగ్గించుకోవాలి?' అనే అంశంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డిఆర్‌యుసిసి మెంబర్ రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంతో శుక్రవారం శ్రీ సరస్వతీ శిశు మందిరంలో సామూహిక జన్మదినాలు నిర్వహించారు. ఐదు గురు విద్యార్థులు వద్ద భారీ కేక్ ను కట్ చేయించి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ సామూహిక జన్మదిన వేడుకలను నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ జీవితంలో మంచి ఉన్నత స్థితికి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మయూరి శ్యామ్ యాదవ్ , ఆచార్యులు రంగనాయకులు , మురళీ రెడ్డి , ప్రసాద్ రెడ్డి, సనత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: డిఎస్‌పి ఉమామహేశ్వర్ రెడ్డి బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అక్కడ కేసుల వివరాలను, స్టేషన్ సిబ్బంది కొరతను, వివిధ రకాలైన విషయాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్లో పాత కేసులను ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎన్ని కేసులు పెండింగ్ ఉన్నాయి? అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరిని గౌరవంగా విచారించి వారి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా పకడ్బందీ బందోబస్తు నిర్వహించి నగదును తరలిస్తే తనిఖీలకు వెంటనే కేసు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీహరి, ఎస్‌ఐ వెంకట నరసింహులు పాల్గొన్నారు.

వైభవంగా సురుటుపల్లి ఆలయ ధ్వజారోహణం

ప్రజాశక్తి -నాగలాపురం: నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీపల్లి కొండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రెండో రోజు శుక్రవారం ఆలయంలో కన్నుల పండుగగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి ఆధ్వర్యంలో కార్య నిర్వహణాధికారి కోటి రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో ధ్వజారోహణ ప్రక్రియ కొనసాగింది. పిచ్చాటూరు మండలానికి చెందిన మాజీ ఎమ్మెల్యే జయచంద్ర నాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మంజుల, ఉమాపతి, ఆనందయ్య, ఆలయ ప్రత్యేక ఆహ్వానితులు రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అభ్యంతరాలు వుంటే తెలపండి: ఎవో

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని 2023-24 సంవత్సరం రబీ సీజన్ కు సంబంధించి 1017 మంది రైతులకు 16 11.59 ఎకరాలలో పంట సాగు చేయగా వీటికి ఈ క్రాప్ బుకింగ్ కూడా పూర్తి చేశామని, వీటిపై అభ్యంతరాలు వుంటే తెలపాలని మండల వ్యవసాయ అధికారి ఖాదర్ మీయా తెలిపారు. మార్చి ఒకటో తేదీ నుండి మూడో తేదీ వరకు ఈ మూడు రోజుల జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం గ్రామసభలు ద్వారా తెలుపుతామని ఏవో పేర్కొన్నారు. మండల రైతులు రైతు భరోసా కేంద్రాలలో ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలపాలన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: రైతులు ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలో రబీ 2023-24 సీజన్‌లో 3,218 యంది రైతులకు 8587 ఎకరాలలో పంటల సాగు ఇ- క్రాప్ పూర్తిచేశామని ఆయా గ్రామాలలో అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ నెల 1వ తేదీ నుండి 3వ తేదీ వరకు ఇ క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శిస్తారని, గ్రామ సభలు కూడా వుంటాయని, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, ముసాయిదా జాబితాలో వున్న వివరాలు, ఇ క్రాప్ నమోదు అన్ని వివరాలు తెలుసుకొని ఏమైనా అభ్యంతరాలు వుంటే రైతు భరోసా కేంద్రాలలో తెలపాలని పేర్కొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్: ఈ-క్రాప్ పంట నమోదులో రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని శ్రీకాళహస్తి మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 2023-24 సీజన్ 4633 మంది రైతులకు 11870 ఎకరాలలో పంటల సాగు , ఈ-క్రాప్ నమోదు పూర్తి చేశామని తెలిపారు. మండలంలో రైతులు ఏమైనా అభ్యంతరాలు వుంటే గ్రామ సభల్లో తెలపాలన్నారు. సమీపంలోని రైతు భరోసా కేంద్ర సిబ్బంది, వివిఏ, విహెచ్ఎ, విఎస్ఎ లను సంప్రదించి తెలపాలన్నారు.

పాలిటెక్నిక్, ఏపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో 2024-2025 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం 10వ తరగతి మార్చి, ఏప్రిల్ 2024 పరీక్షకు హాజరవుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యార్థినివిద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని కో-ఆర్డినేషన్ ఫెడరేషన్ ఏపీ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎ.విశ్వనాథరెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష ఉంటుందని, మార్చి 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోడానికి ఏప్రిల్ 5 వరకు గడువు ఉంటుంది. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27న జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 8688888802/03, 9399976999 నెంబరులకు సంప్రదించవచ్చునని తెలిపారు.

తూతూ మంత్రంగా ఉపాధి సోషల్ ఆడిట్

- కోట్లాది రూపాయల ఉపాధి పనులు
- రూ.ఎనిమిది వేల అవినీతి
- గంటలోనే మండల బహిరంగ సభ పూర్తి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలో నిర్వహించిన సోషల్ ఆడిట్ నామమాత్రంగా సాగింది. కోట్లాది రూపాయల ఉపాధి పనులు నిర్వహించగా రూ. ఎనిమిది వేలు మాత్రమే అవినీతి జరిగిందని బహిరంగ సభలో తేల్చడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

సామాజిక తనిఖీ బహిరంగ సభలో పాల్గొన్న అధికారులు

మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరం నిర్వహించిన ఉపాధి పనులపై వారం రోజులు పాటూ సామాజిక తనిఖీ తూతూ మంత్రం గా తనిఖీ బృందం నిర్వహించిందని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వలసలను నివారించడానికి ఉపాధి పనులు అమలు చేస్తోంది. ఉపాధి పనులలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా నియంత్రించడానికి ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్స్ తో గ్రామాలలో మస్టర్లను చేత పట్టుకొని ప్రతి కూలి ఇంటికి వెళ్లి పరిశీలిస్తారు. వారు గడిచిన సంవత్సరంలో ఎన్ని రోజులు, ఎక్కడెక్కడ పనులు చేశారనే వివరాలు వారికి తెలిపి, వారిని తీసుకుని వెళ్లి పనులలో రికార్డు ప్రకారం కొలతలను సేకరిస్తారు. సామాజిక తనిఖీ సందర్భంలో రికార్డులను అనుసరించి కూలీలు తెలిపిన వివరాలు సక్రమంగా లేకపోతే వాటిని తనిఖీ బృందం నమోదు చేసుకుని ఆ కూలీ నుంచి సంతకం తీసుకుంటారు. గ్రామమంతా నిర్ణయించిన రోజులో తనిఖీ చేపట్టిన అనంతరం ఒకరోజు గ్రామ స్థాయిలో బహిరంగ సభ నిర్వహించి జరిగిన పనులు, చోటు చేసుకున్న అవకవకలను వివరిస్తారు. అన్ని పంచాయతీల నుంచి సేకరించిన వివరాలను లోటుపాట్లను బహిర్గతం చేయటానికి బహిరంగ సభ నిర్వహిస్తారు. సామాజిక తనిఖీపై ఒకప్పుడు ప్రజలలో ఎంతో విశ్వాసం ఉండేది. అవినీతి లక్షలలో బయటపడేది. అవినీతి రహితంగా పనులు జరగటానికి సామాజిక తనిఖీ ఒక ఆయుధంగా పనిచేసేది. అలాంటి ది ప్రస్తుతం నామమాత్రంగా ఆడిట్ ను పూర్తిచేయడం పలు అనుమా నాలకు తావిస్తోంది. రామచంద్రాపురం మండలంలో అన్ని గ్రామాలలో ఉపాధి పనులు కోట్లాది రూపాయల తో చేపట్టారు. ఈ పనులలో ఉపాధి సిబ్బంది, ఏపీవో సహాయ సహకారాలతో తమ చేతివాటం చూపారని కూలీలు వాపోతున్నారు. ఈ మోసాలను సోషల్ ఆడిట్లో బయట పడకుండా ఉండటానికి ఉపాధి సిబ్బంది తమ పరిధిలోని ప్రతి జాబ్ కార్డు హోల్డర్ దగ్గర 100 నుంచి 200 రూపాయలు వరకు వసూలు చేసి తనిఖీ బృందానికి సమర్పించారనే విమర్శలు వస్తున్నాయి. గ్రామాలలో తూతూ మంత్రంగా తనిఖీ చేశారని కూలీల వద్ద తెల్ల పేపర్లలో సంతకాలు పెట్టుకుని తరువాత తమకు నచ్చిన విధంగా రాసుకున్నట్టు సమాచారం.

కష్టం ఒకరిది.. ఫలితం మరొకరిది..

ఎండలలో కష్టించి ఉపాధి పనులు చేపట్టే కూలీలకు అరాకొర మొత్తాలు అందుతున్నాయి. పనులు నిర్వహించే ఉపాధి సిబ్బందికి లక్షలాది రూపాయలు చేరుతున్నాయి. పనులకు వెళ్లని వారి పేర్లు మస్టర్లలో నమోదు చేసి సిబ్బంది ఆ మొత్తాలను నొక్కేస్తున్నారు. బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా కూలీల వేలిముద్రలు సేకరించి గుట్టు చప్పుడు కాకుండా పెద్ద మొత్తంలో సిబ్బంది ఉపాధి డబ్బులను కాజేస్తున్నారు. కష్టపడి పని చేసే కూలీలకు వందల రూపాయలు వస్తుంటే బోగస్ పేర్లను నమోదు చేసుకునే ఉపాధి సిబ్బందికి లక్షల రూపాయలు ఆదాయం వస్తున్నట్లు తెలుస్తోంది. 15 సంవత్సరాలుగా ఉపాధి పనులు చేస్తున్న కూలీలు కూలీలు గానే ఉండటం, పనులు చేయిస్తున్న సిబ్బంది కోట్లాది రూపాయలకు పడగలెత్తడం ఇందుకు నిదర్శనం. సోషల్ ఆడిట్ కి లక్షలాది రూపాయలను ఖర్చుచేసి కేవలం ఎనిమిది వేల రూపాయలను అవినీతిగా చూపటం కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా వుందని పలువురు విమర్శిస్తున్నారు. సోషల్ ఆడిట్ బహిరంగ సభలో తిరుపతి జిల్లా ఉపాధి సంచాలకులు శ్రీనివాస ప్రసాద్, ఎంపీడీవో ప్రత్యూష, ఏపీ డి పద్మలత , జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ముత్యం శెట్టి విశ్వనాథ్, అంబుడ్స్ మెన్ రాస రాయ నాయుడు, ఎస్ ఆర్ పి రవి, డిఆర్‌పిలు, సిబ్బంది పాల్గొన్నారు

వైసిపికి దశరథ రామిరెడ్డి, సర్పంచ్‌లు రాజీనామా

ప్రజాశక్తి -కోట : కోట మండలం వైసీపీ కి చెందిన పలువురు ముఖ్య నాయకులు చిల్లకూరు దశరథ రామిరెడ్డి, సర్పంచ్ వారి పదవులకు శుక్రవారం రాజీనామా చేశారు. ఈ సందర్బంగా దొరువు కట్ట గ్రామంలోని చిల్లకూరు దశరథరామిరెడ్డి నివాస గృహంలో మాజీ శాసన సభ్యులు, నియోజకవర్గ అభ్యర్థి పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ త్వరలో వీరంతా టిడిపిలో చేరుతారన్నారు.అనంతరం ముఖ్య నాయకులు చిల్లకూరు దశరథ రామిరెడ్డి వైసీపీ తిరుపతి పార్లమెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామ చేశారు.వంజివాక ఎంపీటీసీ ఎంబెటి శశి,పుచ్చలపల్లి సర్పంచ్ దువ్వూరు.గోవర్ధన్ రెడ్డి వంజివాక సర్పంచ్ పాముల. ఆదెమ్మ, తదితరులు వారి పదవులకు రాజీనామ చేశారు. రేపు వారు చంద్రబాబు నాయుడు సమక్షంలో, పెద్దలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ లో చేరుతారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మద్దాలి సర్వోత్తమ రెడ్డి,రాష్ట్ర రైతు కార్యదర్శి పలగాటి భాస్కర్ రెడ్డి నాయకులు పాదర్తి కోటేశ్వర రెడ్డి,తూపిలి రాధా రెడ్డి, షేక్.జలీల్ అహ్మద్, కోకర్ల మధుయాదవ్, తీగల సురేష్, దారా సురేష్, చాపల శ్రీనివాసులు, తిరుమూరు మురళి, అనూక్ మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి మహిళా లక్షాధికారి కావటమే లక్ష్యం: డిఆర్‌డిఏ పీడీ

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: వైఎస్సార్ క్రాంతి పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళా లక్షాధికారి కావడమే ప్రభుత్వ లక్ష్యమని డిఆర్‌డిఏ పీడీ జ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక వెలుగు మండల సమైక్య కార్యాలయ ఆవరణలో వైయస్సార్ క్రాంతి పథం సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, బాలయ్యపల్లి, బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాలెం, కెవిబి పురం, వెంకటగిరి, డక్కిలి మండలాలకు సంబంధించిన ఏపిఎంలు, సీసీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధికి ప్రవేశపెట్టిన పథకాలు నూరు శాతం అమలయ్యేలా చూడాలన్నారు. వైయస్సార్ ఆసరా నాలుగో విడత విడుదలైందని, ఈ ఏడవ తేదీ వైయస్సార్ చేయూత విడుదల కానుందన్నారు. మహిళలకు బ్యాంకు రుణాలు అందే అధికారు లు చర్యలు తీసుకోవా లన్నారు. సంఘాల్లో అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు బ్యాంకు రుణాలు మంజూరు చేయించి వారికి స్వయం ఉపాధి మార్గాలు కల్పించాలని ఏపీఎం లకు సీ.సీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పది మండలాల్లో సంఘాల ద్వారా అందించిన రుణాలను రికవరీ చేయడంలో శ్రీకాళహస్తి మండలం ప్రథమ స్థానంలో నిలిచిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడి ప్రభావతి, ఐబి డీపీఎం మాధవి, ఫైనాన్స్ డిపిఎం వెంకటేష్, శ్రీకాళహస్తి మండల ఎపిఎం మునయ్య, ఆయా మండల ఏపీఎం లు, సీసీ పాల్గొన్నారు.

ఆర్టీసి కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆర్‌టిసి, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను గూడూరు పాత బస్టాండ్ అవరణలో ఏపిపిటిడి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏపీపిటిడి (ఏపీఎస్ఆర్‌టిసీ) లో కాంటాక్ట్ విధానం రద్దుచేసి, కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు నేరుగా ఆర్టీసీ సంస్థ కనీస వేతనం 26 వేల రూపాయలు, ఇఎస్ఐ, పిఎఫ్, సాధారణ సెలవులు, లేబర్ హాలిడేస్, అమలు చేయాలని వారు కోరారు. ఆర్థిక శాఖ ఇచ్చిన జీవో ప్రకారం ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైనప్పటికీ కార్మికుల జీతాలు పెరగలేదని గత 15 సంవత్సరాలుగా

కరపత్రాలు విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

అధికారులకు వినతి పత్రాలు అందజేసినా పరి ష్కా రానికి నోచుకో లేద న్నారు. హక్కుల సాధన కోసం ఈ నెల 4వ తేదీ విజయవాడ ధర్నా చౌక వద్ద జరిగే ధర్నాను అనంత రం సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సిఐటియు అధ్యక్షుడు బివిరమణయ్య, కార్యదర్శి యస్‌సురేష్, డ్రైవర్లు ఆర్‌అశోక్, జాకీర్, నవీన్ రెడ్డి, రాము, బాలు, పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా ఇచ్చేది కాంగ్రెస్సే: తాంతియా కుమారి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాట ఇచ్చి తప్పిందని, ఆనాడు విభజన ఆంధ్రప్రదేశ్ కు హామీలు ఇచ్చిన ప్రదేశంలోనే నేడు ప్రత్యేక హోదా డిక్లరేషన్ న్యాయ సాధన సభ నిర్వహించి అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇస్తామని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు, మాజీ ఆర్టీఏ కమిషనర్ తాంతియా కుమారి అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు అధికారం చేపట్టి తమ పబ్బం గడుపుకోవడానికి మాత్రమే ప్రయత్నించారే తప్ప ప్రత్యేక హో కోసం పోరాడ లేదన్నారు. ప్రశ్నించే వారిపై ఈడీ కేసులు పెట్టడం బిజెపికి పరిపాటి

మాట్లాడుతున్న ఏపీ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తాంతియా కుమారి

అయిందన్నారు. రాష్ట్రంలో అధికార వైసిపి ఒక చేత్తో డబ్బు ఇచ్చి మద్యం రూపం లో మరో చేత్తో తీసు కుంటూ ప్రజలకు హాని కలిగించే మద్యాన్ని విక్రయించి, సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవితాలతో చెలగాట మాడు తోందన్నారు. ఈ సంద ర్భం గా మహిళా కాంగ్రెస్ తిరుపతి జిల్లా అధ్యక్షురాలుగా మోసిన బేగంను నియమించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, నెల్లూరు పార్లమెంట్ల ఇన్‌ఛార్జీ సునీల, సుభాషిని, భాను, శివకుమారి పాల్గొన్నారు.

ప్రజల కోసం పోరాడితే రౌడీ షీటర్లా?: బొజ్జల సుధీర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: 'ప్రజా సమస్యలపై శాంతి యుతంగా పోరాడితే మా కార్యకర్తలపై రౌడీ షీట్లు ఓపెన్ చేస్తారా..? ఇదెక్కడి న్యాయం?' అంటూ టిడిపి శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి ప్రశ్నించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టిడిపి నేతలు, కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారని, ఆ కేసుల్లో ఇరికించిన వారిని రౌడీ షీటర్లుగా చిత్రీకరిస్తున్నారని దీనిపై స్పందించాలని బొజ్జల సుధీర్ రెడ్డి ఎస్‌పి మలిక గర్గ్ కు శుక్రవారం వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందని, చట్టబద్ధంగా పని చేయాల్సిన పోలీసులు వైసిపి తొత్తుల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. శ్రీకాళహస్తి లో తొట్టంబేడు, ఏర్పేడు, శ్రీకాళహస్తి రూరల్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పనిచేసిన సిఐలు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అనుచరులుగా చలామణి అవుతూ టిడిపి కార్యకర్తలపై ఇష్టానుసారం అక్రమ కేసులు బనాయించారన్నారు. అక్రమ కేసుల్లో ఇరుక్కున్న 47 మంది టిడిపి కార్యకర్తలపై రౌడీ షీట్లు ఓపెన్ చేసేందుకు పోలీసులు యత్నిస్తున్నారని ఇప్పటికే ఏడుగురిపై ఈ ఏడాది జనవరిలో రౌడీ షీట్లు ఓపెన్ చేశారని తెలిపారు. అధికారులు స్పందించి శ్రీకాళహస్తి నియోజవర్గంలో చట్టం, శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి గురువారెడ్డి, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, తిరుపతి పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష, పార్లమెంట్ నాయకులు చెంచయ్య నాయుడు, కంటా రమేష్, కామేష్ యాదవ్, విజయ్ కుమార్, ధనంజయనాయుడు పాల్గొన్నారు.

అధికారులపై ప్రజాప్రతినిధుల చిందులు

- మెగా కంపెనీకి తొత్తుగా ఇరిగేషన్ అధికారులు
- రసాభాసగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -తొట్టంబేడు: తొట్టంబేడు మండల సమావేశం మందిరంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. ప్రజా ప్రతినిధులు చెప్పిన ఏ ఒక్క పని అధికారులు చేయడం లేదని అధికారులపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు చిందులేసారు. పేరుకే సర్పంచులు పెత్తనం అధికారులది అన్న చందాగా మండలంలో అధికారులు తీరు నడుస్తుందని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా మెగా కంపెని మండలంలో సాగించిన మట్టి దందా అంతా ఇంతా కాదనీ, చెరువులు, పొలాలు, రోడ్లను నాశనం చేశారని సర్పంచ్ లు విమర్శించారు. కాసరం చెరువులో మెగా కంపెని చేపట్టిన తవ్వకాల్లో బయటపడ్డ ఖనిజపు రాయిని కూడా మెగా వాళ్ళు దోచుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు కాలువలు సబ్ కెనాలని కూడా నాయుడుపేట కాళహస్తి ప్రధాన రహదారిలో మెగావాళ్ళకి తొత్తులుగా మారి చిన్న చిన్న పైపులు వేసి చేతులు దులిపేసుకున్నారన్నారు. వీరికి ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం తొత్తుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ బిల్లులు రాక మండలంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం నిలదీశారు. ఉపాధి హామీ పథకంలో 875 జాబ్ కార్డులు ఉన్నాయని, 2,85 వేల పని దినాలు కల్పించామని, ఎనిమిది కోట్ల నలభై లక్షలు నగదు ఇప్పించామన్నారు. హార్టికల్చర్ కింద వంద ఎకరాలకు ప్లాంటేషన్లు చేయించామన్నారు. దీని ద్వారా మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ ,మునగ, పండ్లు రకాల వ్యవసాయాలకు మొగ్గు చూపుతున్నామని ఏపీవో సుజాత అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉన్నం నిర్మల, వైస్ ఎంపీపీ మల్లికమ్మ ,వైస్ ఎంపీపీ2 గేరటారెడ్డి, తంగేడు పాలెం పిఏసిఎస్ చైర్మన్ మనీ నాయుడు, మండల అధ్యక్షులు వాసుదేవ నాయుడు, ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్ మధు రెడ్డి పాల్గొన్నారు.

దోమలు ఫుల్..నియంత్రణ నిల్

- కాలువల్లో మురుగు నీరు నిల్వ
- ఎటు చూసినా అపరిశుభ్రత
- వణికిస్తున్న వ్యాధుల భయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాల్టీ పరిధిలో గత కొన్ని రోజులుగా అపరిశుభ్రత పెరుగుతోంది. మురుగు కాలువల్లో నీరు నిల్వ వుండడం, చెత్త కుప్పలను సకాలంలో తొలగించకపోవడంతో దోమలు అధికమవుతున్నాయి. దోమల నివారణ మందులు పిచికారీ చేయకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ప్రజలు దోమలు కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం వుందని భయాందోళనకు గురవుతున్నారు.

పుత్తూరు మున్సిపాల్టీ పరిధిలో 28 వార్డులు వున్నాయి. వీటిలో 14వ వార్డు షాపు వీధి, 16వ వార్డు జెండామాను వీధి కాలువల్లో మురుగునీరు పేరుకుపోయి ముందుకు కదలడంలేదు. ఆర్‌టిసి బస్టాండు పక్కనే మురుగు కాలువ వద్ద దోమలు అధికమై స్థానికులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. అన్ని వార్డుల్లో పరిశుభ్రత లోపిస్తోంది. సకాలంలో చెత్త తొలగించక పోవడంతో అపరిశుభ్రత నెలకొంది. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో దోమలు బెడద అధికంగా వుంది. మున్సిపాల్టీ అధికారులు దోమల నివారణ మందులు పిరికారీ చేయకపోవడంతో



మట్టి పేరుకుపోయి ముందుకు కదలని మురుగునీరు

దోమలు రాత్రి, పగలు తేడా లేకుండా విజృంభిస్తున్నాయి. రాత్రి వేళల్లో నిద్ర పూర్తిగా కరువైందని, దీనికి తోడు జ్వరాలు ప్రబలే ప్రమాదం వుందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలంలో వున్నట్లే ఎండా కాలం లోనూ దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.

పనిచేయని నియంత్రణ మందులు

దోమల ధాటికి ప్రజలు తట్టుకోలేక, మార్కెట్లో లభ్యమయ్యే రకరకాల మందులు వినియోగిస్తూ చైనా బ్యాట్లతో దోమలపై యుద్ధం చేయకతప్పలేదు. ఎన్ని మందులు వాడినా దోమలు తాత్కాలికంగా తగ్గుతున్నాయి. మార్కెట్లో విక్రయించే మస్కిటో కాయిల్స్, ఆల్‌ఔట్ లిక్విడ్, బ్యాట్లపై ఆధారపడాల్సి వస్తోంది. వీటిని ఉపయోగిస్తున్నా దోమలు విజృంభిస్తున్నాయని ఈ కారణంగా అనారోగ్యం బారిన పడక తప్పదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్యం పాలై ప్రజలు ఆసుపత్రులకు వెళితే రకరకాల రక్త పరీక్షల చేసి ఆరు నుండి పది రకాల మాత్రలు రాస్తున్నారని తగ్గడంలేదని వాపోతున్నారు.

కనిపించని పరిశుభ్రత

మున్సిపాలిటీ పరిధిలో పరిశుభ్రతకు అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదు. మురుగు కాలువలో నీళ్ల నిల్వ ఉండడం, దోమల మందు పిచికారి చేయకపోవడం, సకాలంలో చెత్త తీయకపోవడం వంటి కారణాల వల్ల దోమలు అధికమవుతున్నాయి. ఇంటి పన్ను, చెత్త పన్ను, నీటి పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ వలంటీర్లకు, సంబంధిత అధికారులకు అపరిశుభ్రత తొలగింపుపై ఏమాత్రం శ్రద్ధ లేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు అపరిశుభ్రతను తొలగించి దోమల నివారణ చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

క్రైం న్యూస్

అక్రమ బంగారం పట్టివేత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రైల్వే స్టేషన్ ల్లో అక్రమంగా రైలులో తరలిస్తున్న 200 గ్రాములు బంగారం, 14 లక్షల 75 వేల రూపాయల నగదును గూడూరు రైల్వే పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గూడూరు రైల్వే ఎస్ఐ కొండప్ప నాయుడు మాట్లాడుతూ సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న నెల్లూరుకి చెందిన ఇద్దరు వ్యక్తులను అనుమానం వచ్చి వారిని తనిఖీ చేశారు. ఓ వ్యక్తి వద్ద బ్యాగ్ లో ఎలాంటి రసీదులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 200 గ్రాములు బంగారం, 6లక్షలా50వేల రూపాయల నగదు, రెండో వ్యక్తి వద్ద 8లక్షలా 25 వేలు రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారన్నారు. వారి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఆ నగదును, బంగారంను స్వాధీనం చేసుకొని ఇన్‌కం టాక్స్ అధికారులకు అప్పగించాలమన్నారు. ఈయన వెంట రైల్వే సిబ్బంది జయప్రకాష్ , వెంకటేశ్వర్లు , గణేష్ పాల్గొన్నారు.

వాలంటీరుకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -కెబివిబి పురం: ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో వాలంటీరు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. కెవిబిపురం మండలంలోని కేసి కంట్రీ గ్రామానికి చెందిన వాలంటీరు వెంకటేష్ ద్విచక్ర వాహనంలో అత్తారింటికి బయలుదేరాడు. ద్విచక్రవాహనం కెవిబిపురం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. స్థానికులు 108 సాయంతో శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ కు తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

షార్ కాంట్రాక్టర్ ఆత్మహత్య

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట షార్ బస్టాండ్ సమీపంలో షార్ కాంట్రాక్టర్ వి. నాగేశ్వరరావు శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రాజమండ్రికి చెందిన నాగేశ్వరావు శ్రీహరికోటలోని షార్ కేంద్రంలో 30 సంవత్సరములుగా స్ట్రక్చర్ కాంట్రాక్టర్ గా పని చేస్తున్నారు. ఆయన ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణమని తెలుస్తోంది. సూళ్లూరుపేట ఎస్సై రహీం రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వి. నాగేశ్వరరావు (ఫైల్ ఫొటో

తిరుమల డిఎస్పిపై చర్యలు తీసుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి: కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ పట్ల అమానవీయంగా ప్రవర్తించిన తిరుమల డిఎస్పి కొండప్పపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొండప్ప వ్యవహరించిన తీరుపై సమగ్ర విచారణ జరిపించాలని, కులం పేరుతో దూషించడం, అక్రమ వసూళ్లకు పాల్పడమని ఒత్తిడి చేయడం, అనారోగ్య కారకుడు కావడం తదితర విషయాలు తీవ్రమైనవని పేర్కొన్నారు. డిఎస్పిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేసి కఠినంగా వ్యవహరించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా గుణపాఠం నేర్పించాలని కోరారు. లక్ష్మీనారాయణ వైద్యానికి అవసరమైన ఖర్చును ప్రభుత్వం భరించి తోడ్పడాలని కోరారు.

'బాల్యాన్ని చిదిమేయొద్దు..'

బాల్య వివాహాల అనర్థాలపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తొట్టంబేడు: బడిలో బాలికల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన బాల్యాన్ని బాల్య వివాహాలు చేసి చిదిమేయొద్దని తంగేళ్ల పాలెం (హెచ్‌డబ్ల్యు)అంగన్వాడీ కార్యకర్త పద్మావతి పిలుపు నిచ్చారు. మండలంలోని తంగేళ్లపాలెం లో శుక్రవారం తంగేళ్లపాలెం హెచ్‌డబ్ల్యు అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను, ప్రోత్సహించినా విధించే శిక్షలను తెలిపారు. ఈనెల 10వ తేదీన శ్రీకాళహస్తిలో జరిగే స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవంలో ఎక్కువ శాతం బాల్య వివాహాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఎవరైనా బాల్య వివాహాలు చేస్తుంటే వెంటనే అంగన్‌వాడీ కార్యకర్తలకు, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, అంగన్‌వాడీ కేంద్రం ఆయా తేజోవతి పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ ఈవో'

ప్రజాశక్తి -తిరుమల: ఈ 2వ తేదీ శనివారం ఉదయం 9 నుండి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో 'డయల్ యువర్ ఈవో 'ను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డికి ఫోన్ ద్వారా నేరుగా తెలుపవచ్చు. భక్తులు నెంబరు 0877-2263261 నెంబర్లకు తెలపాలని సూచించారు.

విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య విద్యావతి పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ రీజనల్ డైరెక్టరేట్ ఆఫ్ ఎన్ఎస్ఎస్ ఇచ్చిన పిలుపు మేరకు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్‌బ్యూరో ఆధ్వర్యంలో 'మేరా పెహ్లా ఓట్ దేశ్ కేలియే' శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఆచార్య విద్యావతి మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు, భయాలకు లోనుకాకుండా యువత విధిగా వారి ఓటు హక్కుని వినియోగించుకోవాలని, దేశాన్ని ముందుకు నడిపించే , మానవాళికి సేవ చేసే ట్రాక్ రికార్డ్ ఉన్న నాయకులను, మానవ హక్కులను, సమాజా న్ని బలోపేతం చేసే నాయకత్వ లక్షణాలు కలిగిన సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

31వ తేదీ లోపు పన్ను చెల్లిస్తే మినహాయింపు: కమిషనర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఈ నెల 31వ తేదీ లోపు పన్నులు చెల్లిస్తే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని, ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ కెఎల్‌ఎం రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రం లో అన్ని పురపాలక సంఘాలలో ఆస్తి, ఖాళీ జాగా పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు, ఈ ఆర్థిక సంవత్సరం పన్ను పై విధించిన వడ్డీని వన్ టైమ్ మెజర్ గా మాఫీ చేశారని పేర్కొన్నారు. పన్ను చెల్లించవలసిన చెల్లింపుదారులు బకాయి మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంతో సహా ఒకే సారి చెల్లించాలన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఆస్తి , ఖాళీ స్థలాల పై పన్ను బాకాయిలు ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామని పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇంటి పన్ను బకాయిలు వున్న వారు ఈ నెలాఖరులో మొత్తాన్ని చెల్లించాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీఓ జారీ చేసిందని పేర్కొన్నరు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యాచకులకు అన్నదానం

ప్రజాశక్తి -కోట : కోట శ్యామసుందరపురానికి చెందిన గూడపాకల రామమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు గూడపాకల సుబ్బారావు దాతృత్వంతో శుక్రవారం శ్యామ సుందరాపురం ఎదురుగా మెయిన్ రోడ్డుపై ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద యాచకులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జి.ఎస్.ఆర్. యూత్ సభ్యులు పాల్గొన్నారు.

యాదవుల అభివృద్ధి టీడీపీకే సాధ్యం: బొజ్జల సుధీర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: యాదవుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన నియోజకవర్గ యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. యాదవుల ను రాజకీయంగా ఉన్నత స్థాయిలో నిలిపిన ఘనత బొజ్జల గోపాల కృష్ణారెడ్డిదని కొనియాడారు. మరి నేడు వైసీపీ పాలనలో యాదవుల పై దాడులు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని విమర్శించారు. టీడీపీ హయాంలో బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో రుణాలను మంజూరు చేసి యాదవుల అభివృద్ధికి తన తండ్రి గోపాలకృష్ణారెడ్డి ఎంతగానో దోహదపడ్డాయన్నారు. ఆయన లక్ష్యం కోసం బరిలోకి దిగిన తనకు యాదవులు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామేష్ యాదవ్, మునిరాజా యాదవ్, బలరాం యాదవ్, సురేంద్ర యాదవ్, రామకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.